# స్వాతి వారపత్రిక

1983లో ఆరంభించబడిన ఈ పత్రిక- ఆదినుంచీ పాఠకులకి మెరుగైన కథల్నీ, మేలైన రచనల్నీ సరసమైన ధరకి అందజేస్తోంది. ఇతోధిక పారితోషికంతో రచయితల్ని ప్రోత్సహిస్తూ, శతాధిక ప్రయోగాలతో పాఠకులకి మనోరంజకమైన ఈ పత్రికని సంపాదకులు శ్రీ వేమూరి బలరాం సపరివారపత్రికగా రూపొందించిన తీరు అనన్యసామాన్యం. అందుకే ఇది లక్షలాది పాఠకులు కొని చదువుతున్న ఏకైక తెలుగు వారపత్రికగా ఖ్యాతికె క్కింది. మెరుగైన రచనలకోసం స్వాతి ప్రతి ఏటా ఒక క్రమ పద్ధతిలో విభిన్న తరహా కథలు, నవలల పోటీలు నిర్వహిస్తుంది. వాటిలో సుమధుర శృంగారానికి ప్రాధాన్యమిచ్చే సరసమైన కథ, సున్నిత హాస్యానికి ప్రాధా న్యమిచ్చే కామెడీ కథల పోటీలు విశిష్టమైనవి. 16 వారాల సీరియల్ నవలలకోసం- స్వాతి నిర్వహించే పోటీలు ఎందరో రచయితలకి స్ఫూర్తినిస్తూ ఊపిరి పోస్తున్నాయి. ప్రచురణకి ముందే రచనలకి పారితోషికం అందజేయడం స్వాతి ప్రత్యేకత. ఈ 72-పేజీల పత్రిక సపరివారసత్వానికి మచ్చుగా ఫిబ్రవరి 20, 2009 సంచికని (శీర్షిక పేజి నంబరు బ్రాకెట్లలో సూచించబడింది) పరిశీలిద్దాం.

**ఆధ్యాత్మికం:** ఓ ప్రముఖవ్యక్తి జీవనదృక్పథం- Times of India దినపత్రిక ఆదివారం నాడు My Time My Voice స్థాయిలో- వినిపించే 'మై గాడ్' (పేజి 2). 'సత్యాన్వేషణ' (28). ఉషశ్రీ ద్వారా 'ధర్మ సందేహాలు' (32). విద్యాప్రకాశానందగిరి స్వాములవారి 'కథాఫలే' (56).

**స్పందన:** పాఠకుల స్పందనకి ఉత్తరాల 'సాక్షి' (4).

**రాజకీయం:** డా. దుగ్గరాజు శ్రీనివాసరావు తనదైన శైలిలో వినిపించే సమకాలీన రాజకీయాల నిష్పక్ష విశ్లే షణ- తెలియనివారికి నాలెడ్జి, తెలిసినవారికి అవగాహన, తెలిసీ తెలియనివారికి ఎడ్యుకేషన్. ఈ సంచికలో వైయస్, నారా, చిరు, కెయస్సార్‌లకి రానున్న ఎన్నికల్లో ఉన్న విజయావకాశాల పరిశీలన ఉంది (14). మాజీ ఐఏయస్ అధికారి పి.వి.ఆర్.కె. ప్రసాద్ 'అసలేం జరిగిందంటే' అంటూ బట్టబయలు చేసే కుతూహల రాజ కీయ రహస్యాలు (48).

**సీరియల్స్:** హాస్యవ్యంగ్యాలతో ముళ్ళపూడి అలనాటి రచనల్ని మరిపించి మురిపిస్తూ- 'ఆత్మకథ'కి కొత్త భాష్యమిచ్చిన ముళ్ళపూడి వెంకటరమణ 'కోతి కొమ్మచ్చి' (10). 16 వారాల నవలల పోటీలో బహుమతి

పొందిన రచన (16). వంశీ భాషకి, బాపు అపూర్వ 'చిత్రకల్పన'తో 'మన్యంరాణి' (38). స్వాతికే ప్రత్యేకమైన మధుబాబు నవల (60).

**శృంగారం:** అతి లేకుండా- గిలిగింతలు పెట్టే శృంగారానికే సాధారణంగా ప్రాధాన్యమిచ్చే సరసమైన కథ- ఈ సంచికలో పోటీలో బహుమతి పొందినది (30). డాక్టర్ సమరం నిర్వహణలో 'సుఖ సంసారం'గా ప్రసిద్ధి కెక్కి- ప్రస్తుతం 'సెక్స్ అండ్ సైకాలజీ'గా నడుస్తున్న శృంగార జ్ఞాన, విజ్ఞాన, పరిజ్ఞాన శీర్షిక- కొన్ని వర్గాల విమర్శకి గురైంది. పచ్చి శృంగారాన్ని ఆటపాటలుగా చలామణీ చేసినా- సెన్సారు అభ్యంతరపెట్టని నేటి సినిమాల నేపథ్యంలో- ఆ విమర్శ బేసబబు. సెక్స్ ఎడ్యుకేషన్ని పాఠ్యాంశం చేయనున్న ప్రభుత్వ నిర్ణ యాల దృష్ట్యా ఆ విమర్శ అసమంజసం (54).

**ప్రత్యేకం:** యువతకోసం ప్రేమగీత (8). ఆరోగ్యానికి చెర్రీ పళ్ళు చేసే మేలు (16), మహిళలకి సలహాలు, సమాధానాలు, చిట్కాలు వినిపించే 'లేడీస్ క్లబ్' (18). వ్యాపారానికి 'జీవన్ సూత్ర' (20). పిల్లల వినోదానికీ, పరిజ్ఞానానికీ అనిల్‌స్వాతి (21). 'ప్రకృతి ప్రేమ' (34). 'వాస్తు విజ్ఞానం' (44). వాస్తవదృక్పథంతో- జ్ఞానాన్నీ, లోకజ్ఞానాన్నీ ప్రయోజనాత్మకంగా మేళవించిన మాలతీ చందూర్ 'నన్ను అడగండి' (45). 'ప్రేమికుల రోజు' (46). 'వరఫలం' పేరిట వార ఫలాలు (52). 'ఫర్ U' పేరిట పరిజ్ఞానం (53). కొత్త వంటల 'కుక్స్ టచ్' (57). పెదవుల సింగారానికి చిట్కాలు (67). స్వాతికే ప్రత్యేకమైన 'ఈ శీర్షికమీదే': ఎవరి ప్రశ్నకి వారే చమత్కా రంగా బదులిస్తే- ఉత్తమ ప్రశ్నకి 200 రూపాయలు, ఎన్నికైన ప్రతి ప్రశ్నకీ 150 రూపాయలు ఇచ్చే అపురూ పమైన ఈ శీర్షిక- పాఠకుల సెన్సాఫ్ హ్యూమర్‌కి ప్రోద్బలాన్నీ, ప్రోత్సాహాన్నీ ఎంతలా ఇస్తుందంటే- ఈ శీర్షిక పేజీలని కత్తిరించుకుని పుస్తకాలుగా బైండ్ చేయించుకున్నవారిలో సినీ ప్రముఖులు కూడా ఉన్నారు.

**సినిమా కబుర్లు:** తారలపై ఫోటో వ్యాసాలు: ఇలియానా (58), కొయినామిత్ర (66); అర్థవంతమైన చిత్రస మీక్ష, సమర్థవంతమైన విషయ సేకరణ వగైరా (68).

**కథలు:** సాంసారికం (42), హాస్యం (50).

ఇంకా మధ్య పేజీలలో ఉత్తమాభిరుచికి అద్దంపట్టే కార్టూన్లు (చాలావరకూ 'బాపు'వి), సూక్తులు. అందమైన ఫోటోలు, బొమ్మలు. సరదా పోటీలు, కబుర్లు.

వీటన్నింటి విలువా వారానికి పది రూపాయలు.